
# మతమంటే కించిత్తైనా నమ్మకము లేని వాడనై యుంటిని

## సాక్షము - లేట్ బ్రదర్ జి. ఏబెల్ (మచిలీపట్నం)



ఏబెల్ దంపతులు

ఆ నాటి ఆంధ్ర ప్రదేశ్ లోని కృష్ణా జిల్లా లో దావులూరు అనే గ్రామము లో నేను జన్మించాను. నా తల్లిదండ్రులు నామకార్థ క్రైస్తవులు, ఆత్మ వలన మార్చబడిన వారు కానందున బైబిల్ చదువుట, ప్రార్థించుట, గుడికి వెళ్ళుట అనే క్రైస్తవ అలవాట్లను మాకు నేర్పలేదు. మతమంటే - మనుష్యుని నీతి సంబంధమైన కట్టుబాట్లలో నుంచటానికి మనుష్యుని వలన రూపొందించబడిన ఒక పథకం అని, మనుష్యులను వారి దుష్ట స్వభావము నుండి మార్చగల శక్తి ఏ మతము లో లేదని, క్రైస్తవ మతము కూడా అలాటి మతమే నేను తలంచాను. అనేక మంది క్రైస్తవ బోధకులు తాము చేసిన ప్రసంగము చొప్పున తామే జీవించక పోవుట గమనించినందున క్రైస్తవమును గూర్చి ఈ అభిప్రాయమును నేను కలిగి యుండేవాడిని.

యవనుడనై ఈ జీవిత సుఖ భోగములను అనుభవించుటానికి తీర్మానించుకొని, పొగ త్రాగుటానికి, సినిమాలకు వెళ్ళుటానికి, డ్రామాలలో నటించుటానికి ఆరంభించి అపవిత్రమైన వ్యభిచార జీవితము నకు కూడా బానిసనయ్యాను. పాప భోగములందు మునిగి జీవిస్తూ క్షణభంగురమైన ఆనందము మాత్రమే అనుభవించాను. ఈ క్రమం లో గతించి పోయే క్షణికమైన ఆనందము తీరిపోయిన తర్వాత నా మనస్సు భరించలేని ఆవేదన తోనూ, అపవిత్ర

తలంపులతోను నిండిపోయినందువల్ల నా విద్య యందు ఆసక్తి తగ్గి త్వరలోనే చదువు లో క్లాసులో అందరికంటే వెనుకబడ్డాను.

హరిజన ప్రజలకు సేవచేయాలని ఆశించి, ఒక నాయకుడనై ఆ పార్టీని స్థాపించిన వ్యక్తిని పూజించటం ఆరంభించాను. క్రైస్తవ విద్యార్థులు తమ విధ్యను కొనసాగించుటానికి ఎక్కువ అవకాశములు లేనందున వారు హిందువులు గా మారితే అనేక స్కాలర్షిప్పులు లభిస్తాయని చెప్పి వారిని హిందువులు గా మారేటట్లు ప్రోత్సహించాను.

మనుష్యుడు దేవుని గురించి తలంచనక్కర లేదని, మనుష్యునికి మొదట కావలసినవి అన్న వస్త్రాలు, ఆ తరువాత మంచి ఉద్యోగమని తలంచాను. పరలోకమున్నదని నమ్మలేదు. మనుష్యుడు ఏ కొద్దిమేరకైనా మంచి జీవితము జీవించితే చాలు అని నమ్మేవాడిని. అసలు మరణము తరువాత జీవితమనేది ఉంటే, దేవుడు అనే వాడు ఉంటే అయన యొద్దకు అందరం చేరుతాము అని నమ్మేవాడిని. అన్ని మతములొక్కటే నని, అవి అన్నీ ఒక విషయాన్నీ వేర్వేరుగా బోధిస్తున్నాయి అని తలంచేవాడిని. నీతితో గూడిన

జీవితము జీవించాలి అని ఒక్కొక్కసారి ఆశించినా అది నాకు సాధ్య పడలేదు.

నా పరిస్థితిని చూసి నా తల్లిదండ్రులు చాల దుఃఖించారు. అయినా నేను వారి మాటను లెక్క చేయలేదు. ఆ రోజుల్లో ఎన్. దానియేలు గారి కూటములలో మారుమనస్సు బొందిన మా చిన్నాయన గారు తాను తన జీవితం లో అనుభవించిన మార్పును గురించి అప్పుడప్పుడు నాతో చెప్తూ ఉండేవారు, కానీ దుష్టత్వము లోను, పాపేచ్ఛలలోను మునిగిపోయినందున దేవుని వైపు తిరుగుటకు నేను నిరాకరించాను. హైస్కూల్ విద్య ముగిసింది, కళాశాలలో చదువుటకు హరిజనుడనై ప్రభుత్వ స్కాలర్షిప్ కొరకు దరఖాస్తు పెట్టుకొనే నిమిత్తము నా పేరు హైందవ పేరుగా మార్చుకో బోతున్నానని నా తండ్రితో చెప్తే, అయన దానికంగీకరించలేదు. అప్పుడు నేను - ఏదో పరలోకమునకు వెళ్లాలనే వెర్రి ఆశతో ఈ లోకము లో దొరికే శ్రేష్టమైన సదుపాయాలు పోగొట్టుకొనుటం కేవలం పిచ్చితనమని మా తండ్రి తో చెప్పేను.

పాలిటెక్నిక్ లో చేరేందుకు నాకు సీటు దొరికింది. ఈ సందర్భం గా కొన్ని విషయాలు సంప్రదించేందుకు మా చిన్నాయన గారింటికి

నేను వెళ్ళాను. వెళ్లిన సమయం నుండి ఆ దినమంతా మా చిన్నమ్మ మారుమనస్సు ను గూర్చిన బోధ చెయ్యటం చూసి మూఢమత పిచ్చిలో మునిగిపోయిన కొందరి వలే ఆమె కూడా మునిగిపోయారని అనుకొని ఇక వారి యింటిలో నుండి మరునాడు వెళ్లిపోవాలని నిశ్చయించుకున్నాను. అయితే ఆ రాత్రి కూడా ఆమె క్రీస్తు ను గురించి చెప్తూ క్రీస్తు ప్రభువు ఒక్కడే రక్షకుడని నొక్కి చెప్పటం ప్రారంభించారు. అప్పుడు నేనామెను అడ్డగించి రాముడు, కృష్ణుడు, మహమ్మదు, బుద్ధుడు - వీరంతా కూడా దైవాతారాలే గదా అని వాదించాను. అంతలో మా చిన్నాయిన కల్పించుకొని నీవు ప్రస్తావించిన వీరందరూ పాపులను రక్షించగలవారని నీవు నమ్మితే వారిలో ఒక్కక్కరికి ప్రార్థించి నీ పాపములను ఒప్పుకో… వారు నీ పాపములను క్షమించి నీ జీవితమును మార్చితే …. వారినే దేవుడని పిలిసి ఆరాధించు అని చెప్పి, నీ పాప జీవితము నుండి నిన్ను విడిపించి మార్చగలిగిన వారు క్రీస్తు ప్రభువు తప్ప మరెవ్వరూ లేరని ఖరా ఖండిగా నాతో అన్నారు. ఈ మాటలు నా హృదయం లో సవాలుకరం గా గ్రుచ్చు కున్నాయి.

ఇంకా కొంచెం సమయం వారు క్రీస్తు ను గురించి మాట్లాడిన తర్వాత మేము ముగ్గురం ప్రార్థించుటకు మోకరించాము. మా

చిన్నాయన గారు ప్రార్థిస్తూవుండగా  నాలో తెలియని విధంగా ఏదో వణకు  పుట్ట నారంభించింది; ఎందుకు అలా జరుగుతుందో నాకే అర్థం కాలేదు. నాకు నిజం గా ఆలా జరుగుతున్నదా అని కండ్లు తెరచి చూచాను..... అది నిజమే! మా చిన్నాయన ప్రార్థన ముగించిన తర్వాత  నన్నుకూడా ప్రార్థించమని అడిగారు: పెద్ద వారి మాట నిరాకరించకూడదని నోరు తెరచి "ఓ ప్రభువా! నేను పాపిని, గ్రహింపు లేక నీ సత్యమునకు వ్యతిరేకముగా ఏదో వాదించాను" అని ప్రార్థించాను! వెంటనే ఒక మహా గొప్ప వెలుగు నా ముఖం పై ప్రకాశించి, లోతైన గ్రహింపు తో కూడిన  పశ్చాత్తాపము నాలో కలిగింది. వేదనతో కన్నీరు కార్చుచూ నేను చేసి నాకు జ్ఞాపకమున్న  పాపములన్నీ కన్నీటితో ఒప్పుకున్నాను. పాపభారము నా హృదయం లో నుండి తొలగి పోయి వెంటనే నా లోనికి గొప్ప మార్పు వచ్చింది. సంతోష సమాధానాలతో నా హృదయం నిండి పోయింది.  ఇదివరకెన్నడూ అటువంటి సంతోష సమాధానాలు నేను అనుభవించలేదు. నా తలంపులు, చూపులు, కోరికలు, పూర్వపు దుష్ట అలవాట్లు అన్నీ మారిపోయాయి.

నేనింటికి తిరిగి వెళ్ళినప్పుడు నన్ను చూచిన వారంతా నేను పూర్తిగా మారిపోయానని గుర్తించారు. నా విరోధుల వద్దకు వెళ్లి సమాధాన పడ్డాను. అప్పటినుండి దేవుని హస్తము నన్ను వాడుకొనటం ప్రారంభించింది. నేను ప్రార్థిస్తే దయ్యములు మనుష్యులను వదలి వెళ్లి పోవటం, వ్యాధిగ్రస్తులు స్వస్థ పడటం - ఇలాటివి జరగటం ప్రారంభించాయి. భయంకరమైనన పాపపు బ్రతుకు నన్ను పూర్తిగా విడిచి పోయింది. పరిశుద్ధ జీవితం జీవించటం ప్రారంభించాను. ఆత్మ రక్షణ నిచ్చే ఈ మహా గొప్ప రక్షకుడైన క్రీస్తు ప్రభువు నాకు కలుగ జేసిన పాప విముక్తి ని గురించి ప్రజలకు తెలిపి, సాక్షం ఇవ్వటం ప్రారంభించాను. . ఈ అనుభవం అనంతరం నేను పాలిటెక్నిక్ కోర్సు లో చేరి కంటిన్యూ చేశాను. ఒక రోజు నేను ఒంటరిగా ప్రార్థిస్తూ ఉండగా "నీ కోర్సు ముగిసిన తరువాత రెండు సంవత్సరాలు నీవు వుద్యోగం చేసి ఆ తరువాత నీవు నా సేవకు రావాలి" అని ప్రభువు నాకు తెలియ జేస్తున్నట్లు నేను గ్రహించాను. అదే విధం గా రెండు సంవత్సరాలు పీడబ్ల్యూడీ శాఖ లో పని చేసిన తరువాత ప్రభువు పూర్తి సేవలోనికి నేను ప్రవేశించాను. ఇప్పుడు నా భార్య తో కలిసి ప్రభువు నన్ను పంపిన స్థలం (మచిలీపట్టణం) లో దేవుని సేవ చేస్తున్నాను.

గమనిక: సహోదరుడైన ఏబెల్ గారు కుటుంబం తో కలిసి మచిలీపట్టణం లో మంచి సేవ ను కట్టారు, వీరి సేవలో అనేక మంది రక్షించబడి స్థిరులు గా నిలిచారు. ప్రభువు ఎన్నో ఘన కార్యములు వీరి పరిచర్య ద్వారా చేశాడు. 1982 లో ప్రభువు పిలుపు నందుకొని వీరు పరలోకం చేరారు. వీరి పూర్తి సేవా వివరాలను ఆంగ్లం లో ఈ కింది లింక్ నుండి చదువ వచ్చు. - https://familyandbible.com/wp-content/uploads/2022/02/In-His-Vineyard-for-practice-spaces-between-paras-decreased.pdf